www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 నవంబర్ 2023



## 'జగనన్న ఆరోగ్య సురక్ష'విజయవంతం

**ప్రజాశక్తి-నెల్లూరు :**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం జిల్లాలో విజయవంతమైనట్లుకలెక్టర్ ఎం హరి నారాయణన్ తెలిపారు. సెప్టెంబర్ 30 తేదీ నుంచి ప్రారంభమై నవంబర్ 8వ తేదీ వరకు జరిగిన ఈ కారక్రమంలో అర్బన్ పరిధిలో 166, రూరల్ పరిధిలో 497 మొత్తం 663 ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. 2,44,866 మంది ప్రజలు వైద్య సేవలు పొందారని కలెక్టర్ చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 59362 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా 6722 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తిం చారన్నారు. 91,974 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా, 14586 మందికి బీపీ, 9384 మందికి మధుమేహం ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు చెప్పారు. 4920 మందికి చిన్నచిన్న శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్య సేవలు అవసరమని గుర్తించి ఆరోగ్యశ్రీ నెట్వర్క్ ఆసుపత్రులకు వైద్యులు సిఫారసు చేసినట్లు తెలిపారు.

కలెక్టర్ ఎం హరినారాయణన్

# సిమెంట్ ధరల మంటలు..!

ప్రభుత్వ విధానాలు నిర్మాణ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీస్తుంది. ఇసుక, స్టీల్, ఇతర నిర్మాణ వస్తువులు భారీగా ధరలు పెరిగిన విషయం తెలిసిందే. తాజాగా సిమెంట్ ధరలకు రెక్కలొస్తున్నాయి. ఐదో, పదో రూపాయలు పెరగడం సహజం.. తాజాగా ఒక్క నెల్లోనే సిమెంట్ ధరలు రెండు సార్లు రూ.70 పెంచారు. గత నెల 10న రూ 50, ఈనెల 1న మరో రూ.20 పెంచి నిర్మాణ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఎవరిని అడగాలో తెలియక కొందరు నిర్మాణాలు నిలుపుదల చేసుకుంటున్నారు. ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున సిమెంట్ ధరలు పెరగడానికి కారణాలు తెలియడం లేదు. రాజకీయ ఒత్తిడి కారణంగా, రానున్న ఎన్నికల్లో నిధులు సమకూర్చుకోడానికి కంపెనీలపై ఒత్తిడి చేయడం వల్లే ఇంతలా పెరిగాయని సమాచారం.

- ఒకే నెలలో రూ.70పెంపు
- నాలుగేళ్లలో వంద శాతం పెరుగుదల
- నిర్మాణ రంగలో మరో పడుగు..!

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

భవన నిర్మాణ రంగం వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కుదేల్ అవుతోంది. 2019 ఎన్నికలకు ముందు ఇసుక ఉచితంగా దొరికేది. సిమెంట్ బస్తా రూ.250 నుంచి రూ.280 వరకు ఉండేది. నెల్లూరు నగరానికి ట్రాక్టర్ ఇసుక కేవలం బాడుగు రూ.950. టిప్పటర్ ఇసుక రూ.3500 వరకు ఉండేది. 2019 నూతన ప్రభుత్వం వచ్చాక నూతన ఇసుక విధానం ప్రవేశపెట్టింది. కంపెనీల చేతిలో పెట్టడంతో నెల్లూరు నగరానికి ట్రాక్టర్ రూ.4500 నుంచి రూ.5000 ఉంది. టిప్పర్ ఇసుక రూ.18,000 మాటే. ఒకే సారి నిర్మాణ రంగంపై ఇసుక పిడుగులా పడిపోయింది. ఇనుము అదే పరిస్థితి. టన్ను రూ.65 వేల వరకు ఉంది. నిర్మాణ రంగంలో అన్ని వస్తువులు ధరలు భారీగా పెరగడంతో అపార్ట్మెంట్, ఇళ్ల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కొందరు విధిలేని పరిస్థితుల్లోనే నిర్మాణాలు సాగిస్తున్నారు. మరి కొందరు ధరలకు భయపడి నిలుపుదల చేశారు. ఇదంతా ఒకటైనే సిమెంట్ ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి.

**సిమెంట్ ధరల మంట..!**

సిమెంట్ ధరలు నిర్మాణ రంగంలో మంటలు పెడుతోంది. 2019లో ఒక బస్తా సిమెంట్ రూ.250 నుంచి రూ.280 వరకు ఉండేది. ప్రస్తుతం సిమెంట్ బస్తా ధర రూ.370 నుంచి రూ.410 వరకు పెరిగింది. కేవలం నాలుగేళ్ల సమయంలో వంద శాతం ధరలు పెరిగాయి. ఓవైపు ఇసుకతో ఇబ్బందుల పరిస్థితుల్లో సిమెంట్ అదే స్థాయిలో పెరిగిపోయాయి. గత నెల 16న పిపిసి, ఒపిసి సిమెంట్ ధరలు ఒక్కసారిగా రూ.50 పెంచారు. కెసిపి పిపిసి రూ.300, ఒపిసి రూ.350 ఉండగా, రూ.350, రూ.400 పెరిగాయి. తాజాగా మరో రూ.20 అదనంగా పెంచారు. పిపిసి రూ.370, ఒపిసి రూ.420 వరకు ఉంది. ఒక్క కంపెనీనే కాదు. దాదాపు అన్ని కంపెనీలు ఇదే దారిలో ఉన్నాయి. సాధారణంగా ప్రత్యేక పరిస్థితుల్లో ఐదో, పదో రూపాయలు పెంచుతారు. ఒకే నెలలో సుమారు రూ.70 పెంచాల్సిన అవసరం ఏం వచ్చింది అనేది ఇప్పుడు మార్కెట్లో వివాదం. రానున్న ఎన్నికలకు నిధులు సమకూర్చాల్సి ఉంటుందని, సిమెంట్ కంపెనీలకు ఆదేశాలు రావడంతో ఆ మొత్తం వినియో గదారులపై వేశారని ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ పెద్దలు ధరలు విషయం నోరు మెదపడం లేదు.

| కంపెనీ | 16-10-23 | ఓపిసి | పిపిసి | 09-11-23 | ఓపిసి | పిపిసి |
|---|---|---|---|---|---|---|
| (రామ్ కో సిమెంట్) | --- | 390(రూ.) | 300 | --- | 460 | 370 |
| పెన్నా, | --- | 390 | 300 | --- | 446 | 370 |
| భారతి | --- | 390 | 300 | --- | 460 | 370 |
| దాల్మియా | --- | 390 | 300 | --- | 440 | 370 |
| అల్ట్రాటెక్ | --- | 410 | 320 | --- | 480 | 390 |
| అంబుజా | --- | 290 | 250 | --- | 370 | 330 |
| ఎసిసి | --- | 320 | 250 | --- | 390 | 375 |
| బిర్లా | --- | 355 | 290 | --- | 400 | 360 |
| కోరమండల్ | --- | 370 | 300 | --- | 395 | 320 |

మాట్లాడుతున్న మంత్రి సిదిరి అప్పలరాజు

## కావలిలో వైసిపి బస్సు యాత్ర

**ప్రజాశక్తి - కావలి :** , సామాజిక అసమానతలు ఇప్పటికీ రూపుమాసిపోలేదని, వాటిని రూపుమాపేం దుకుసంక్షేమపథకాలు ప్రజలకందజేసిన జగన్మో హన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని రాష్ట్ర మంత్రి శీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. వైసిపి తలపెట్టిన సామాజిక, సాధికార బస్సుయాత్ర గురువారం కావలిలో వైసిపి జాతీయ ప్రధానకార్యదర్శి, 5జిల్లాల రీజనల్ కో- ఆర్డినేటర్, రాజ్యసభసభ్యులు విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలతో పాటు మంత్రివర్యులు ప్రారంభించారు.

## శనగ విత్తనాలు పంపిణీ

**కందుకూరు :**మండలంలోని కొండముడుసుపాలెంలో మండల వ్యవసాయాధికారి వి రాము అధ్వర్యంలో ముఖ్య అతిథిగా హాజరైన కందుకూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి సుశీలకాక్ 2 తెల్ల శనగలు రైతులకు పంపిణీ చేశారు. మొత్తం 265 మంది రైతులకు 271 క్వింటాల్ పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి రాముతెలిపారు. ఉద్యాన సహాయకురాలు రమాదేవి ఉన్నారు.

## బంగారం చోరీ

**కందుకూరు :** పామూరు రోడ్డులోని బంగారం షాపులో గురువారం చోరీ జరిగింది. గురువారం సాయంత్రం3గంటల సమయంలో షాపులోకి వస్తువులు కొనడానికి వచ్చిన మహిళలు దాదాపు 40 నిమిషాల పాటు వస్తువులను చూస్తూ షాపు యజమాని ఇంకొక పని చూసే లోపు 60 గ్రాములు బంగారం ప్యాకెట్లు తీసుకొని వెళ్లిపోయిన నట్లు యజమాని తెలిపారు. షాపు యజమాని సుబ్బారావు కంప్లైంట్ మేరకు టౌన్ ఎస్ఐ హనీఫ్ షాపుకు వచ్చి సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## టిడిపి సమావేశం

**ప్రజాశక్తి -కావలి :**కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో కావలి టిడిపి కార్యాలయంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వ హక కార్యదర్శి పి.చంచల్ బాబు యాదవ్, తదితర నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యాచరణపై చర్చించుకున్న అనంతరం పట్టణంలో జరుగుతున్న వైసిపి నేతల సామాజిక సాధికారక బస్సు యాత్ర పై కామెంట్ చేశారు.

## పటిష్టంగా అభివృద్ధి కార్యక్రమాలు : కలెక్టర్

**ప్రజాశక్తి-నెల్లూరు :** సుస్థిర అభివద్ధి లక్ష్యాలలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల ద్వారా క్షేత్ర స్థాయిలో చేపట్టిన కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు సంబంధిత డేటాను ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ హరి నారాయణన్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో జిల్లాలో అమలు జరుగుతున్న కార్యక్రమాల పురోగతిపై సమీక్షించి తగు సలహాలు,సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి గంగా భవాని, ఐసీడీఎస్ పిడి హేన సుజన, సిపిఓ రాజు, సమగ్ర శిక్ష ఎపిసి ఉషారాణి, ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా ఖాదర్ వలి, డిసిహెచ్ఎస్ డా. రమేష్ నాథ్, ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో పాల్గొన్న అధికారులు

## మెగా రక్తదాన శిబిరం

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో

**ప్రజాశక్తి-నెల్లూరు**

నగర పరిధిలోని స్థానిక 15వ డివిజన్ బాలాజీ నగర్ సెంటర్లో డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా నెల్లూరు ఎసి సుబ్బారెడ్డి ప్రభు త్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా భాషా ముఖ్య అతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారం భించారు. అనంతరం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ, ఉపాధి సమస్యలపై యువతను చైతన్య పరుస్తుం దన్నారు. సమస్యల పైన కార్య క్రమాలు చేస్తూ, మరోవైపు సేవా కార్యక్రమాల వైపు యువతను నడిపిస్తూ మంచి మార్గాల వైపు నడి పిస్తున్న సంఘం డివైఎఫ్ఐ అని కొనియాడారు. ఇటీవల యువత చెడు వ్యసనాలకు బాని సలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత డివై ఎఫ్ఐ సంఘం పైన ఉన్నదని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బీపీ నరసింహ, ఎంవి రమణ లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం యువత తమవంతుగా డివైఎఫ్ఐ సంఘాలతో కలిసి ప్రతి వార్డులో సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 15వ డివిజన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, బాబు, 15వ డివిజన్ మాజీ నాయకులు అల్లంపాటి శ్రీనివాస్ రెడ్డి, డివైఎఫ్ఐ నగర నాయ కులు కుమార్, నాని సిఐటియు నాయకులు జి నాగేశ్వరావు, టీవీ వి ప్రసాద్ మహిళా సంఘం నాయకులు మస్తాన్ బి, పద్మ, సుబ్బమ్మ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ ఉన్నారు

## సాగునీరు విడుదల చేయాలి

**నెల్లూరు :** జిల్లాలో రబీ సీజన్‌లో పంటల సాగుబడికి అవసరమైన నీటిని ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి వ్యవసాయాన్ని పరిరక్షించేందుకు జిల్లా అధికారులు కృషి చేయాలని రైతు సంఘం నాయకులు షాన్‌వాజ్, రమణయ్య డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. అఖిలపక్షం రైతు సంఘం, ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్లు గంగపట్నం రమణయ్య, ఎస్ కే.షాన్ వాజ్ మాట్లాడారు. రైతు సంఘం నాయకులు వెంకటరమణయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిశ్చితార్థ వేడుక

**ప్రజాశక్తి-కందుకూరు :**ఒంగోలులోని ఐటిఎ కన్వెన్షన్ లో జరిగిన గుంటుపల్లి శ్రీదేవి, రాజకుమార్ దంపతుల కుమారుడు నిఖిల్ చౌదరి, పోతుల చైతన్య, రాజేంద్రప్రసాద్ దంపతుల కుమార్తె గౌతమి సిరి..నిశ్చితార్థ వేడుకకు కందుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరై ఆశ్వర్వదించారు.కందుకూరు పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు, పార్టీ నాయకులు నాగేశ్వరరావు వెంట ఉన్నారు.



ఒంగోలు సౌత్ బైపాస్ రోడ్డులోని సాయి ఐటిఎ కన్వెన్షన్ లో మాజీ శాసన సభ్యులు పోతుల రామారావు సోదరుడు పోతుల రాజేంద్రప్రసాద్ - చైతన్యల కుమార్తె గౌతమి సిరి - నిఖిల్ చౌదరి నిశ్చితార్థ మహోత్సవం కార్యక్రమం జరిగింది. టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

## దేవస్థాన భూములకు బహిరంగ వేలం

**బుచ్చిరెడ్డిపాలెం:**మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం బుచ్చిరెడ్డిపాలెం మండలం, దేవస్థానమునకు చెందిన జొన్నవాడ గ్రామంలోని సర్వే నెంబర్ 28/1, 28/3, 29, 32-2, 34-2, 35-3, 36-2, 36-4, 102 లలోని మొత్తం ఎ. 38.15 సెంట్లు మాగాణి/మెట్ట భూములకు 3 సంవత్సరములు కాలపరిమితి కి గాను గురువారం పెనుబల్లి బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు,సహాయ కమిషనర్ ఉన్నారు.

## 12న పెయింట్ వర్కర్స్ అభినందన సభ

**కందుకూరు :**పెయింట్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) అభినందన సభ ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరగనుందని ఎఐటియుసి నాయకులు వై ఆనందమోహన్ , జెవి రవి కోరారు. గురువారం సిపిఐ కార్యాలయంలో ఆ యూని సమావేశం జరిగింది. ఈ సందరభంగా వారు మాట్లాడారు. పెయింట్ వర్కర్స్ యూనియన్ నాయకులు శీను,మాలకొండయ్య,పవన్,రోజ పాల్గొన్నారు.

## పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలి

**కందుకూరు :**మండలంలోని పందలపాడులలోని జాషువా కాలనీ వద్ద పంచాయతీ తాగునీరు మెయిన్ పైపు పగిలిపోయింది. 3నెలలైనా గడుస్తున్న పంచాయతీ అధికారులు గానీ, సర్పంచ్ గానీ ఎవరూ పట్టించుకోవడంలేదని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులు స్పందించి పగిలిపోయిన త్రాగునీరు పైపు స్థానంలో కొత్తది ఏర్పాటుచేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని మోషే విజ్ఞప్తిచేశారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి కేసులో

# కీలక నిందితుడు అరెస్టు

**రూ.7 లక్షల నగదు, ఆయుధాలు సీజ్**

**ప్రజాశక్తి-నెల్లూరు**

గత నెలలో కావలి జాతీయ రహదారిపై ముద్దూరుపాడు వద్ద బెంగుళూరు నుంచి విజయవాడకు వెళ్తున్న విజయవాడ ఆటోనగర్ ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సు డ్రైవరు బొందిలి రామ్ సింగ్ పై దాడికి పాల్పడిన కేసులో ఎ1 నిందితుడు దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. గురువారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి కె.తిరుమలేశ్వరరెడ్డివివరాలు వెల్లడించారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై దాడికి సంబంధించిన కేసులో ఏడుగురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. రాష్ట్రంలోనే కలకలం సృష్టించిన ఈ ఘటనను జిల్లా పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణ ప్రారంభించామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా పేర్కొంటున్న దేవరకొండ సుధీర్‌ను అరెస్టు చేశామని తెలిపారు. పోలీసుల తనిఖీల్లో అతని ఇంటిలో ఉన్న రూ.7 లక్షల నగదు, 4 పదునైన కత్తులు, 4 ఎయిర్ ఫిస్టల్స్, పోలీసులు వినియోగించే 4 హ్యాండ్ కప్స్, 4 వాకీ టాకీలు, లీడింగ్ చైన్లు, 2 సెల్‌ఫోన్ సిగ్నిల్స్ జామర్లు, ఫోల్డింగ్ ఐరన్ స్టిక్స్, భారీ సంఖ్యలో సెల్‌ఫోన్లు, ల్యాబ్‌ట్యాప్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తెల్లవారు జామును కావలి తుఫాన్ నగర్‌లోని దేవరకొండ సుధీర్ ఇంటిని బెటాలియన్ పోలీసులు కావలి, నెల్లూరు పోలీసులు సోదాలు చేశారనాన్రు. ఈ సోదాల్లో రూ.7 లక్షల నగదు, మారణాయుధాలు, ఫిస్టల్స్‌ను, నగదు లెక్కించే మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితుడిపై రాష్ట్రంలో 10 చోట్ల 25 కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. నిందితుడు తన అనుచరులతో కలిసి అమాయకులను మోసం చేయడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడటమే ప్రధాన నైజంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. ఇటీవల దేవరకొండ సుధీర్ అనుచరులను అదుపులోకి తీసుకున్న సమయంలో ఈ ముఠా సభ్యులవల్ల మోసపోయిన వారు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని ప్రకటించామన్నారు. ఈ ప్రకటన వల్ల ఆరుగురు దేవరకొండ ముఠా సభ్యుల వల్ల మోసపోయామంటు ఫిర్యాదు చేశారన్నారు. ఈ ముఠా సభ్యుల వల్ల ఆర్థికంగా నష్టపోయిన వారు ఎవరైనా నిరభ్యంతరంగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎస్‌పి ప్రకటించారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై దాడికి సంబంధం ఉన్న నిందితులందరినీ అరెస్టు చేయడంలో ముఖ్యంగా దేవరకొండ సుధీర్‌ను అదుపులోకి తీసుకోవడంలో నైపుణ్యం ప్రదర్శించిన సిబ్బందికి ఎస్‌పి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో కావలి రూరల్ పోలీసు స్టేషన్ సిఐ రాజేష్,ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి

## రహదారులు అధ్వానం : జనసేన

**నెల్లూరు అర్బన్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 29వ డివిజన్ లో ఉన్న సుభాష్ చంద్రబోస్ నగర్ , ఆటో నగర్ ప్రాంతాల్లో చినుకు రాలితే చిత్తడిగా మారిపోతుందని జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గి శెట్టి సుజయ్ బాబు విమర్శించారు. గురువారం 29వ డివిజన్‌లోని పలు ప్రాంతాలను ఆయన జన సైనికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నెల్లూరులో కొద్దిపాటి వర్షానికి రోడ్లు జలమయం అవుతున్నాయన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరా మిరెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు జగదీష్ రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి కరీం, డివిజన్ ఇంచార్జిలు భీమయ్య, ఉదయ్, అదిశేషయ్య, రామాంజనేయులు , వెంకటేశ్వర్లు ఉన్నారు.

**సైదాపురం :**మండల కేంద్రమైన సైదాపురం బస్టాండ్ ఆవరణంలో రోడ్ల అధ్వాన్నస్థితిపై గురువారం జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పరిపాలన విషయంలో ఘోరంగా విఫలమైం దన్నారు. ఎపికి జగన్ అవసరం లేదు, పవన్ కళ్యాణ్ అవసరం అనే పోస్టర్‌ను ప్రదర్శించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు పవన్ ఉన్నారు.

నెల్లూరులో..

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ప్రజాశక్తి - లింగసముద్రం :** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిందని మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం లింగసముద్రంలోని సచివాలయం-1లో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుం దన్నారు.ప్రజల మన్ననలు పొందిన జగన్ మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిని చేసు కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జడ్‌పిటిసి డాక్టర్ చెన్ను నళినిపద్మ పేర్కొన్నారు. అనంతరం పంచాయితీలోని ఎస్‌టి కాలనీలో ప్రచారం నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి,జెసిఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్ణారెడ్డి, సూపరిండెంట్ కట్టా శ్రీనివాసులు,సర్పంచ్ రాఘవులు,ఎఎంసి వైస్ చైర్మన్ మేకనబోయిన శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు షేక్ షషి,సర్పంచ్‌లు దామా సీతారా మాయ్య,డబ్బుగొట్టు మల్లిఖార్జున,వైసిపి నాయకులు వంకాయపాటి వెంకటేశ్వర్లు, మల్లెబోయిన వెంకటేశ్వర్లు,వెన్నపూస కొండారెడ్డి, ఉండేలా ఆది నారా యణరెడ్డి, ఈఓపిఆర్‌డి కెవిసుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు మాధవరావు, నవీన్ ఉన్నారు.

## అంజమ్మ సేవలు మరువలేనివి

**గుడూరు :** గుడ్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న అంజమ్మ అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందింది. ఈ నేపథ్యంలో సిపిఎం సీనియర్ నాయకులు జాలయ్య ,సిఐటియు నాయకులు తదితరులు అంజమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అంగన్‌వాడీ యూనియన్‌లో చురుగ్గా పనిచేసే అంజమ్మ మతి చెందడం బాధాకరమని ఒంగోలు సిడిపిఓ పని రాజకుమారి తెలిపారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, భర్త ఉన్నారు.

## జహంగీర్ బాషా మృతికి సంతాపం

**ప్రజాశక్తి-కందుకూరు :** పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గత కొన్ని సంవత్సరాలుగా స్వీట్ షాపు నిర్వహిస్తున్న షేక్ జహంగీర్ బాషా మతి పట్ల ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంచి మనసున్న మనిషి, తన రుచికరమైన స్వీట్లతో కందుకూరు పట్టణ ప్రజలకు చేరువైన వ్యక్తి షేక్ జహంగీర్ బాషా ఆకస్మిక మరణం చెందటం తనకు ఎంతో బాధ కలిగించిదని ఆయన ఆయన తెలిపారు. బాషా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## రాష్ట్రంలో అరాచక పాలన : పొంగూరు

**నెల్లూరు సిటీ :** వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని 43వ డివిజన్ కోటమిట్ట, షాదీమంజిల్ తదితర ప్రాంతాల్లో..బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి ల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. డివిజన్ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు.

**కందుకూరు :**బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రజలు సమస్యలు చెప్పుకుంటున్నారు. గురువారం ఆయన పట్టణం లోని 14 వ వార్డు యాదవపాలెం, చుట్టుగుంట రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచారు. స్థానికులు తమ బాధలను నాగేశ్వరావుతో చెప్పుకున్నారు. ప్రభుత్వ పథకాలు సరిగా అందడం లేదని, రకరకాల కారణాలు చెప్పి సంక్షేమ పథకాలు నిలిపివేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఒక పథకం కింద లబ్ధిదారునిగా ఎంపిక చేస్తే, మిగిలిన పథకాలకు వారిని అనర్హులుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఒక ప్రణాళిక ప్రకారం అన్ని వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తామని నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు గుమ్మడి బ్రహ్మయ్య, కాకుమాని మాల్యాద్రి, గల్లా రాధ, గల్లా రమణయ్య, మల్లెబోయిన ప్రసాదు, కుంచాల సురేష్, గుమ్మడి శ్రీనివాసులు, గుమ్మడి శివ, ముచ్చు వెంకయ్య, తూపిలి వెంకటరావు ఉన్నారు.

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :** జగన్మోహన్ రెడ్డి పాలనలో వేల కోట్ల ప్రజా ధనం దోపిడీ అయిందని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి కార్యదర్శి, ఎంపిటిసి కొణతం రఘుబాబు ఆరోపించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనల మేరకు గురువారం మండలం లోని నరుకూరులో "భవిష్యత్తుకు గ్యారంటీ- ఇది బాబు గ్యారంటీ" కార్యక్రమం జరిగింది. రఘుబాబు వైసిపి పాల నపై తీవ్ర విమర్శలు చేశారు. వైసిపి నేతలకు ప్రజల సంక్షేమం కన్నా వారి వ్యక్తిగత ప్రయో జనాలు ముఖ్యమని రఘుబాబు పేర్కొన్నారు. అనంతరం టిడిపి ప్రవేశపెట్టబోవు చున్న పథకాలు గురించి అయన వివరించారు. అర్హులను గుర్తించి వారిని టీడీపీ బిఎటీ యాప్ లో నమోదు చేసి లబ్ది చేకూర్చే వివరాలు రూపొందించిన బుక్లెట్ లను ప్రజలకు అందజేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించలని కోరారు. బూత్ ఇంచార్జులు ఆరికాటి వెంకటేశ్వర్లు, యకుమార్ ఉన్నారు.

నెల్లూరులో..

## 'వై ఎపి నీడ్ జగన్' ప్రారంభం

**ప్రజాశక్తి-ఉలవపాడు :**ఉలవపాడు లో సచివాలయం-1పరిధిలో గురువారం వై ఎపి నీడ్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎంఎల్ఎ మానుగుంట మహేందర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఆయన ఉలవపాడు సచివాలయంలో ప్రజా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తను ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు నవరాత్రి రూపంలో ఉలవపాడు సచివాలయం పరిధిలో 25వేల కోట్ల పైచిలుకు వివిధ సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. ఎంపిడొ ఎల్ చెంచమ్మ ,తహశీల్దార్ బ్రహ్మయ్య, సర్పంచి మానికల నాగలక్ష్మి, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు నన్నెం పోతురాజు, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు రామాల సింగారెడ్డి వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజల్, రమణయ్య, జెసిఎస్ కన్వీనర్ వెలిచెర్ల ధనకోటి, కష్ణారెడ్డి ఉన్నారు.

**గుడ్లూరు :** గుడ్లూరు సచివాలయం ఒకటో కేంద్రంలో ఎపికి జగన్ ఎందుకు కావాలో కార్యక్రమం గురువారం జరిగింది. సచివాలయం కార్యదర్శి మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలోజెడ్‌పిటిసి బాపిరెడ్డి , ఎంపిడిఒ కె చంద్రశేఖర్ మాట్లాడారు. ఇఒ ఆర్ డి వై వెంకటేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ కాపులూరి కష్ణ యాదవ్ జె సి ఎస్ కన్వీనర్ గాజుల కిషోర్ ఉన్నారు.

**కలువాయి :** మండలంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు కష్ణా రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. బస్టాండ్ సెంటర్‌లో పార్టీ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సంక్షేమ ఫలాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామ వాలంటీర్ ప్రజలకు ప్రభుత్వం అందించిన వివరాలతో కూడిన కర్ర పత్రాల కిట్ లను జెడ్‌పిటిసి అనీల్ కుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి దేవి, జెసిఎస్ కన్వీనర్ మాదాసు పవన్, పార్టీ అధ్యక్షులు కష్ణా రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గోవర్ధన్, గ్రామ సచివాలయం కార్యదర్శి సుధాకర్, వాలంటీర్‌లు, గహ సారథులు పాల్గొన్నారు.

**తోటపల్లిగూడూరు :**ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వైసిపి మండల క న్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ ప్రత్యూష అధ్యక్షతత తోటపల్లిగూడూరు సచివాలయ పరిధిలో "వై నీడ్స్ ఎపి జగన్" అనే కార్యక్రమాన్ని ప్రారంబి .ంచారు. ఈ సందర్భంగా శంకరయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన ఓ వైపు, కరోనా మహమ్మారి మరోవైపు వెరసి ఆర్థిక లోటు నేపథ్యంలోనూ జ గన్మోహన్ రెడ్డి అత్యంత సమ ర్థవంతంగా ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సిఎంగా కోరు కొంటున్నారని శంకరయ్య గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా గ్రీవె న్ సెల్ అధ్యక్షులు, జగనన్న స చివాలయ మండల కమిటి క న్వీనర్ తలమంచి సురేంద్ర బా బు, ఏఎంసి డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, మాజీ జె డ్పిటిసి చిరంజీవి, మాజీ స ర్పంచ్ ఈదూరు, కన్వీనర్ రా మాచార్యులు పాల్గొన్నారు.

ఉలవపాడులో..

**ఆత్మకూరుఅర్బన్ :** పల్లెకు పోదాం. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం ఆత్మకూరు గ్రామంలోని బట్టేపాడు సచివాలయంలో. నిర్వహించారు. ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. వల్లభనేని రాజేంద్ర, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఉషారాణి ఉన్నారు.

## పల్లెల్లో ఉచిత వైద్యశిబిరం

**ప్రజాశక్తి-సీతారామపురం:** ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు కాకర్ల సురేష్ ఏర్పాటు చేసిన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పేద ప్రజల కోసం ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా ఉచిత వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ చేస్తున్న విషయం విదితమే. అందులోభాగంగా 170వ రోజైన గురువారం "సంజీవని ఆరోగ్యరథం ద్వారా మండలంలోని చిన్ననాగంపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటుగా ఉచితంగా మందులు పంపిణీతో కూడిన వైద్య సేవలందించారు.120 మంది గ్రామస్తులకు డాక్టర్లు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 85 మంది కంటి చూపు సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 205 మంది చికిత్స తీసుకున్నారు.వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాశక్తి-ఉదయగిరి:** ముస్లిములు ఎంతో పవిత్రంగా చేపట్టే గంథమహోత్సవంకు మన ఫౌండేషన్ టిడిపి నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తమ ట్రస్ట్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం స్థానిక అన్న క్యాంటీన్ ఆవరణలో మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి అందజేసిన ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ టిడిపి నాయకులు ట్రస్ట్ సభ్యులు కలిసి సభ్యులు మహబూబ్ సుభాని గంధ మహోత్సవ అన్నదాన కార్యక్రమం కు 8వేలు, అరుంధతి పాలెం పంచాయితీ కార్మికులకు 10 వేలు దిలావర్ బావి వీధిలో అనారోగ్యంతో బాధపడుతున్న మీరా మొహీద్దీన్ కు 10 వేలు చొప్పున తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మన ఫౌండేషన్ సభ్యులు హర్షద్ మున్నా, నౌషాద్ బాబు, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

## నవరత్నాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

**ప్రజాశక్తి-సీతారామపురం:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంట సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయని ఉదయగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సీతారామపురం బిట్ -1 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, బుక్ లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. పనితీరు ప్రభుత్వ పనితీరు సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని, గతంలో టిడిపి జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేస్తూ, ప్రస్తుతం తమ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు. రాబోయే 2024 ఎన్ని కలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్య మంత్రిగా ఎన్నుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి, జెడ్పిటిసి చెరుకు పల్లి రమణారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చింతం రెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న నాయకులు

## విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు

**ప్రజాశక్తి-సీతారామపురం:** నిరుపేద విద్యార్థులకు విద్యను మరింతగా దగ్గరకు చేర్చడానికి ఎం ఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్యూషన్లను గురువారం నుంచి ప్రారంభించామని ఎంఆర్ఆర్ ట్రస్ట్ అధినేత ముడుమాల రమేష్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సీతారామపురం లోని పంచాయతీ కార్యాలయం సమీపాన ట్యూషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్యను అందించి ఉన్నత స్థానాలకు చేరుకోవడంలో తన వంతు కృషి చేస్తానని తమ ట్రస్టు తరపున జిల్లా వ్యాప్తంగా ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సన్నాహకాలు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా కనీసం 20 మంది విద్యార్థులు ట్యూషన్ కు వచ్చే విధంగా ఉంటే ఆ ప్రదేశంలో ట్యూషన్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. మొదటగా మండలంలో ఐదు ట్యూషన్ సెంటర్లను ప్రారంభిస్తున్నామని వీలైనంత తొందరలో జిల్లా మొత్తం వ్యాపింప చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక

**ప్రజాశక్తి-ఉదయగిరి:** రాష్ట్రఉత్తమ ఉపాధ్యాయులు గా ఉదయగిరి ప్రాంతానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపిక అయ్యారు. షబ్బీర్ కాలనీ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ జి మున్నా, ఎన్ షానవాజ్, ఎం పి పి ఎస్ ఉర్దూ కడుమురు, వెంకటాచలం మండలం,ఎస్ డి శంషాద్, ఎం పి పి ఎస్ ఉర్దూ స్కూల్ మెయిన్ ఈ ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపిక అయ్యారు. వీరికి జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11వతేదీ శనివారం విజయవాడ లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవార్డు ప్రదానం చేయనున్నారు.రాష్ట్రంలోనే అత్యంత వెనుక బడిన ప్రాంతంగా చెప్పుకొనే ఉదయగిరి ప్రాంతం నుండి ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు గా అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఉదయగిరి ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చు

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్:** పేదలు న్యాయస్థానంలో ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బి. రాజేష్ పేర్కొన్నారు. గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం పురస్కరించుకొని . కోర్టు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రాజేష్ మాట్లాడుతూ ప్రపంచంలో తొలిసారిగా 1851లో ఫ్రాన్స్ లో పేదలకు ఉచిత న్యాయ సహాయం అమలైందని, భారతదేశంలో 1987లో చట్టం అమలు చేసి పేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఎలా ఉందో పేదలకు ఉచితంగా న్యాయం పొందే హక్కు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్షలలో విజేతలైన వారికి డి.ఎస్.పి ఎన్ కోటారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐ వేణు, ఎస్సై ముత్యాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చిన్నపరెడ్డి, ఐ మాల్యాద్రి, వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎల్‌వి రమణయ్య, తిరుపతమ్మ, కె.వి శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి రాజేష్

## పగటి వేషగాళ్లను ప్రజలు నమ్మరు

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట:** ఓట్ల కోసం రకరకాల వేషాల్లో పగటి వేషగాళ్లు తిరుగుతున్నారని ప్రజలు వారిని నమ్మి ఓటు వేసే పరిస్థితి లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి దుయ్యబట్టారు. గురువారం మండలంలోని లేబూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. లేబూరు గ్రామం నందు 70 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లు డ్రైన్లను ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ యాదవ్, బట్టేపాటి నరేందర్ రెడ్డి, గుణపాటి సురేష్ రెడ్డి, కైలాసం శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి-అనంతసాగరం:** మండలంలోని సోమశిల పరిసర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత విద్యుత్ లైన్లు మరమ్మతులు జరుగుతున్నందున శుక్రవారం కొన్ని గంటలపాటు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ మురళీకృష్ణ తెలియజేశారు. సోమశిల 33/11 కె. వి. సబ్ స్టేషన్ కు వెళ్లే 33 కెవి లైన్ మరమ్మతుల కారణంగా సోమశిల సబ్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఉదయం 08గంటల నుండి మధ్యాహ్నం 01గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

## పట్టణ వైసిపి అధ్యక్షులుగా తాజుద్దీన్

**ప్రజాశక్తి-ఉదయగిరి:** పట్టణ వైఎస్ఆర్ సిపి అధ్యక్షులుగా షేక్ గాజులు తాజుద్దీన్ ను సమన్వయకర్త రాజగోపాల్ రెడ్డి నియమించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి మేకపాటి కుటుంబానికి విధేయులుగా ఉంటూ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న గాజుల కుటుంబానికి పట్టణ అధ్యక్షులుగా ఈ అవకాశం కల్పించడం సంతోషదాయకమన్నారు. నమ్మి జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేశారని మేకపాటి కుటుంబానికి రుణపడి ఉంటానన్నారు. 2024 ఎన్నికల్లో ఉదయగిరి పట్టణ నుండి అన్ని వర్గాలను సమన్వయ పర్చుకుంటూ మంచి మెజార్టీ వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన మేకపాటి రాజమోహన్ రెడ్డి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.



# 'టిడిపి అధికారంలోకి రావడం ఖాయం'

### అవినీతి సొమ్ము కక్కిస్తా

**ప్రజాశక్తి-విడవలూరు**

రానున్న ఎన్నికల్లో తెదేపా అధికారంలోకి రావడం ఖాయమని కోవూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఎలగాలమ్మగుంట, అరుంధతివాడ, ఇందిరమ్మ కాలనీ ముసలారెడ్డి గుంట, పటేల్ నగర్ ప్రాంతాలలో పర్యటించారు. మహిళలు బ్రహ్మరథం పట్టి మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని టిడిపి అధికారంలోకి వస్తే రానున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో తనను గెలిపిస్తే ప్రతి సమస్యను పరిష్కరిస్తారని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ప్రతి అడుగు ప్రజల కోసం ప్రారంభించి 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కేకును కత్తిరించి నాయకులతో కలిసి సంబరాలను నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 50 రోజుల్లో 30 గ్రామాలలో 25,700 కుటుంబాలను కలిశాను రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్ని కలసి వారి సమస్యలు తెలుసుకుంటానన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాల పూర్తిగా వస్తున్నా అభివృద్ధి లేదన్నారు. గ్రామస్థాయి నుంచి వైకాపా అవినీతికి పాల్పడ్డ ప్రతి రూపాయిని కక్కిస్తానన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. వైకాపా చేస్తున్న మాఫియాలను అరికడుతామన్నారు. ఇన్ని రోజులు సహకరించిన తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, మండల అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు, మాతూరు శ్రీనివాసులు రెడ్డి, నాయకులు ఇమామ్ బాషా, తాటిపర్తి సుధాకర్, మేకల శేషయ్య, సమాధి శ్రీనివాసులు, దూది విజయ రాఘవన్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం..

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వాటిని ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్‌డిఒ కె. మధులత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోనే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖ నెల్లూరు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారిచే సామాజిక దురాచారానికి గురైనటువంటి బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని .శ్రేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ వాలంటరీగా నిర్వహించారు. పై కార్యక్రమంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మధులత మాట్లాడుతూ అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు దాటిన తర్వాతే వివాహాలు జరిపించాలని ఈ నిబంధ నలకు విరుద్ధంగా వివాహాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్వహిస్తున్న సమస్త ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు ఆర్డీవో తెలిపారు .కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు కె కోటేశ్వరమ్మ, ఎన్జీవో మిత్రులు ఎస్ పెంచల నరసయ్య, హెడ్ కానిస్టేబుల్ కె శామ్యూల్, సీనియర్ ఉపాధ్యాయులు బి.శ్రీనివాసులు, .రత్నం, వాగాల శ్రీహరి హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ

# వైసిపి జెండావిష్కరణ

**ప్రజాశక్తి-వరికుంటపాడు**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఉదయగిరి వ్యవసాయం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ అలీ అహ్మద్ అన్నారు. మండల కేంద్రమైన వరికుంటపాడు లోని సచివాలయం వద్ద వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని లబ్ధిదారుల లిస్టుకు సంబంధించిన బోర్డును ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి ఆధ్వర్యంలో మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు, ఎంపీపీ గవదగట్ల వెంకట లక్ష్మమ్మ, జే సి ఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు, సర్పంచ్ కొండేపోగు దిలీప్ కుమార్, ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గుంటుపల్లి రామాంజనేయులు, మాగంటి శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, షేక్ జిలాని బాషా, దాసరి ఎర్రఒబయ్య, గవదగట్ల మల్లికార్జున, పోలుబోయిన మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# త్వరితగతిన పనులను పూర్తి చేయాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి**

జగనన్న మనబడి నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి 2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుర్గం పల్లి సర్వరాబాదు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులలో నాణ్యమైన వస్తువులను వాడుతూ నాణ్యతగా పనులు పూర్తి చేయాలన్నారు. పూర్తిచేసిన ప్రతి కాంక్రీట్ స్లాబ్ ప్లాస్టింగ్స్ లకు ఉదయం, సాయంత్రం రెండు పూటల వాటర్ తో క్యూరింగ్ చేయాలని పలు సూచనలు చేశారు. నాడు నేడు పనులకు సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ప్రతి పనికి తీర్మానంలను తీర్మానాల రిజిస్టర్ లో నమోదు చేసి సభ్యులందరిచే సంతకాలు చేయించాలని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తూ భోజనం ఎలా ఉందని విద్యార్థులు అడగగా బాగుందని చెప్పడంతో సంతృప్తి చెంది నిర్వాహకులను ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం సర్వరాబాద్ ప్రాథమిక పాఠశాల ఐదవ తరగతి విద్యార్థులు పఠన అభ్యసన నైపుణ్యాలు సామర్థ్యాలలో అత్యున్నత ప్రతిభ కనబరచి నందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు షేక్ జాఫర్ అహ్మద్, ఉపాధ్యాయులు పి. వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

## సామాజిక శాస్త్రాల బోధనను తప్పనిసరి చేయాలి

**ప్రజాశక్తి-కావలి:** కళాశాలల్లో చరిత్ర, సామాజిక శాస్త్రాల బోధనను తప్పనిసరి చేయాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలకొండ శారద ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ,నేటి సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులే రేపటి చరిత్ర అన్నారు.బ్రిటిష్ వారి పాలనలో ' ఆంగ్ల విద్య' ప్రవేశపెట్టినప్పటి నుండే పేదకాలపు విద్య స్థానంలో సామాజిక శాస్త్రాలు గణితం వైజ్ఞానిక శాస్త్రాల బోధన ప్రారంభమైందన్నారు. వాటిలో ప్రధానమైంది 'చరిత్ర ',చరిత్రను మార్చే హక్కు, ఏ పాలకులకూ లేదన్నారు.జరిగిన వాస్తవాలను వక్రీకరించడమో, కొన్ని చారిత్రక సత్యాలను సిలబస్ నుండి ఎత్తివేయడమో ' సమాజానికి తీరని ద్రోహం చేసినట్లన్నారు.ఇటీవలి కాలంలోదేశవ్యాప్తంగా పలు కళాశాలల్లో చరిత్ర తోపాటు, సామాజిక శాస్త్రాలు లేని గ్రూపులను విద్యా విధా నంలో చేర్చడం జరిగిందని తెలిపారు. భావిపౌరులు వాస్తవాలను అధ్యయనం చేసే అవకాశాలను కల్పించాలని కోరారు.

## నూతన ఖజానా కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి-ఉదయగిరి:** ఉదయగిరి లో నూతనంగా అన్ని హంగులతో నిర్మితమైన ఖజానా కార్యాలయాన్ని గురువారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. అన్ని వసతులు సక్రమంగా సమకూర్చబడ్డాయంటూ ఆయన పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యాలయానికి వచ్చే పోయే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన సబ్ ట్రెజరీ కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంచాలకులు, ఖజానా, లెక్కల శాఖ ఉన్నతాధికారి ఎం మోహన్ రావు, జిల్లా ఖజానా ఉపసంచాలకులు డి గంగాద్రి, తహశీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డి,ఉదయగిరి ఉప ఖజానా అధికారి చిట్టేటి మమత, సీనియర్ అకౌంట్స్ , తాలూకా ఎన్‌జిఒ ప్రెసిడెంట్ బొమ్మ తట్టు శ్రీహరి, మండల సచివాలయ కన్వీనర్ కష్టారెడ్డి, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ ఎస్థాని, శ్రీనివాసులు రెడ్డి,ప్రజా ప్రతినిధులు, వైకాపా నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'మళ్లీ జగనే సిఎం'

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:** ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన అందచేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమం, ఆనందంగా ఉన్నాయని పలువురు వైఎస్సార్సీపీ నాయకులు అన్నారు. గురువారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఇరిగేషన్ కార్యాలయం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డులను మున్సిపల్ చైర్ పర్సన్ గోపారం వెంకటరమణమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసీయస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణకన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్ రెడ్డిలు మాట్లాడుతూ నాడు ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి ఎటువంటి లోటు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు, వైస్ చైర్మన్లు షేక్ సర్దార్, డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు పుచ్చలపల్లి రాధిక, కొప్పోలు రమాదేవి, తోకల తిరుపతమ్మ, సచివాలయ కన్వీనర్లు కొత్తపల్లి శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

## టపాకాయల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

**ప్రజాశక్తి-సంగం:**

స్థానిక సర్కిల్ కార్యాలయం లో సిఐ రవి నాయక్ మీడియా సమావేశం నిర్వహిం చారు. సర్కిల్ పరిధిలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టపా కాయల దుకాణాలలో నిర్వాహకులు ఫైర్ నియమ నిబంధనలు పాటించా లన్నారు. ప్రజలు టపాకాయల కాల్చే సమ యంలో జాగ్రత్తలు పాటించాలని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాశక్తి-విడవలూరు**

అనుమతులు లేకుండా టపాసులు విక్రయి ంచినా తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆంజనేయులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని ప్రజలు తగిన జాగ్రత్తలు వహించి దీపావళి పండుగ జరుపుకోవాలని, తల్లిదండ్రులు పిల్లల దగ్గరుండి బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. మండల ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అదుపు తప్పి బస్సు బోల్తా

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలంలోని బూదవాడ సమీపంలో ఏర్పేడు జాతీయ రహదారిపై విజయవాడ వెళ్తున్న ట్రావెల్ బస్సు గేదెను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 40మంది ప్రయా ణికులు ఉన్నారు. పలువురికి స్వల్ప గాయాలు కాగా వారిని 108సిబ్బంది ఉదయ గిరి, ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఆత్మకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి రాములు ప్రమాద స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని బస్సు పత్రాలను పరిశీలించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడిపారా లేదా అని టెస్ట్ నిర్వహించారు. జిల్లా సరిహద్దు ప్రాంతంలో బద్వేల్ నుండి నంది పాడుకు బియ్యం లోడుతో వెళ్తున్న ఆటోను రాయచోటికి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వ్యక్తులు సురక్షితంగా బయట పడ్డారు.

## ఓటు నమోదుపై అవగాహన

**ప్రజాశక్తి-సంగం:** పట్టణంలోని ఓ ప్రయివేటు డిగ్రీ కళాశాలలో ఆత్మకూరు ఆర్‌డిఒ మధులత ఓటు నమోదు పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.18 నుంచి 21 సంవత్సరాలు లోపు వయసు ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు చేసుకునేవారు తమ ప్రాంతాలలో బిఎల్‌ఓలను సంప్రదించి ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ రాజనారాయణ, విఆర్ఒలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు పల్లిపాడు విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పల్లిపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎన్ శ్రావ్య ఎన్నికయ్యారు. గురువారం జిల్లాలోని ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మి ంటన్ పోటీలలో ప్రతిభ కనబరిచి అండర్ 14 పోటీలు విభాగంలో ఎన్ శ్రావ్య జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి జ్ఞాన ప్రసన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పి.లక్ష్మయ్య, ఇతర ఉపాధ్యాయులు శ్రావ్యను అభినందించారు.

## రైతులకు పట్టాలు పంపిణీ

**ప్రజాశక్తి-సీతారామపురం**

మండలంలోని పలువురు రైతులకు 2018లో సీజేఎఫ్ భూములను పట్టాలుగా అందించగా కొంతమందికి పట్టాల పంపిణీలో జాప్యం జరగగా ప్రస్తుతం పెండింగ్ సమస్యలు తొలగిపోయి రైతులకు పట్టాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. రైతులకు సంబంధించిన సీజేఎఫ్ భూములకు చెందిన పట్టాలను ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అందజేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు పట్టాలను అందించారు. మండలంలోని అయ్యవారిపల్లి 29, గంగవరం 78, గుండుపల్లి 29, చిన్ననాగంపల్లి 94, బసినేని పల్లి 216, సింగారెడ్డిపల్లి 37 మొత్తం 483 మంది రైతులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో తాసిల్దార్ ఎంవికె.సుధాకర్ బాబు, ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు, పలువురు నేతలు పాల్గొన్నారు.

## సంగమేశ్వర ఆలయంలో పూజలు

**ప్రజాశక్తి-సంగం:** స్థానిక శ్రీ కామాక్షి దేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో సహస్ర ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెన్నా నది వద్దకు చేరుకుని పూజలు నిర్వహించి పెన్నా నది నుండి కలశ నీటితో ఊరేగింపుగా ఆలయా నికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.వర్షాలు సమృద్ధిగా కురవాలని వేద పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం భక్తుల స్వామి అమ్మవారు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-బిట్రగుంట**

.బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం బోగోలు విష్ణువర్ధన్ రెడ్డి అభిమానుల కర్రెద్దుల రాజేష్ గంజి జయరాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదరణ కేంద్రంలో అనాథలకు భోజనం ,పండ్లు, స్వీట్లను అందజేశారు.

ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ మాజీ శాసనసభ్యుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పేదల అభివృద్ధి కోసం పాటుపడిన మహనీయుడని ,ప్రజలకి ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజాసేవ చేసే ఏకైక నాయకుడు విష్ణు అని ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుంటు న్నామ న్నారు.కార్యక్రమంలో ఎస్ సతీష్, కొత్తూరు రమేష్ , ఏసుపాదం, జి వి రమేష్, ఆదరణ కేంద్రంలోని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగుండాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి**

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి జె.అంజయ్య పేర్కొన్నారు. గురువారం ఉదయగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫోక్సో ఆక్ట్ ఆవశ్యకత వాటి విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ రామారావు, షరీఫ్ ఉపా ధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కావలి**

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం కింద డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ, కావలి వెంగళరావు నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం గర్భిణులకు, బాలింతలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో డాక్టరు రమ్య , డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి , సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, కమ్యునిటీ ఆర్గనైజర్ ప్రసాద్ , సూపరవైజర్ సుగుణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**In the Court of the I Addl. Junior Civil Judge : Nellore**

**O.S.No. 916 / 2022**

**Union Bank of India,** Erstwhile Corporation Bank, Muthukur Branch, SPSR Nellore District, Represented by its **Branch Manager** - Plaintiff

Vs

**1. Pamula Sujatha** and 2 others - Defendants

**Notice**

To,
**D3. Modem Ramachandra Reddy,** S/o **Krishna Reddy,** residing at D.No.16/3/509, Ramurthy Nagar, Nellore, SPSR Nellore District.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే17-11-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**Sk. Yasdani,** B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

**In the Court of the I Addl. Junior Civil Judge : Nellore**

**O.S.No. 631 / 2019**

**Indian Bank,** Nellore Branch, Trunk Road, Nellore. Represented by its **Manager** - Plaintiff

Vs

**Sigili Kalyani** - Defendant

**Notice**

To,
**Sigili Kalyani, Wife of Krishna,** resident of Door No.13/489/A, Dronam Raju Street, Nellore.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే15-11-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**Sk. Yasdani,** B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

**In the Court of the I Addl. Junior Civil Judge : Nellore**

**O.S.No. 622 / 2019**

**Indian Bank,** Nellore Branch, Trunk Road, Nellore. Represented by its **Manager** - Plaintiff

Vs

**Ponduru Padmavathi** - Defendant

**Notice**

To,
**Ponduru Padmavathi,** Wife of **Chenchalee Achari,** resident of Door No.13/316, Mungamuru Vari Street, Nellore-1.

పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే15-11-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**Sk. Yasdani,** B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.